# ఇంటికో పువ్వు ఈశ్వరుడికో మాల!

"ఏయ్ రిక్షా! స్టేషన్‌కి రిక్షా కడతావా?"

రిక్షావాడు నా వైపు ఎగాదిగా చూశాడు. బహుశః తన రిక్షా ఎక్కేటంత అర్హత నాకు ఉందో, లేదో అను అనుమానమో, ఏమో?

నేనూ అతని వాలకం చూశాను. యువకుడు నిగనిగ లాడుతూ ఉన్నాడు. తను వదులుతున్న సిగరెట్ పొగ ఉంగరాల్లా తిరుగుతూ తన ఉంగరాల జుత్తుని చూడమన్నట్లు నా కళ్ళకి స్ఫురించింది.

"కడతా నండీ!" అన్నాడు రిక్షా దిగకుండానే.

"ఎం తిమ్మంటావ్?" అడిగాన్నేను.

"ఐదు రూపాయలవుద్ది." అతని మాటల్లో ఏదో నిర్లక్ష్యం గోచరించింది.

మా ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కి కరెక్టు రేటు మూడు రూపాయలే. అతను ఐదు రూపాయలడిగాడంటే అది అక్కరలేని బేరం అన్నమాట! ఈ రిక్షావాళ్ళతో ఇదో చిక్కు. జేబులో పది రూపాయలు పడ్డాయంటే మరి కన్నూ మిన్నూ కానరు."

"అదేమిటయ్యా బాబూ! ఇక్కణ్ణుంచి స్టేషన్‌కి మూడు రూపాయలే కదా?" అన్నాన్నేను.

"కిట్టదండీ! ఇట్టవుంటే అయిదూ ఇవ్వండి, కట్టవైతే మరో రిక్సా సూసుకోండి" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆ చుట్టుపట్ల మరో రిక్షా ఉంటే కదా నేను చూసుకునేందుకు?

నేను అయిదు రూపాయలూ ఇవ్వలేక కాదు. కాని నా ఉద్దేశం ఏంటంటే, అతను మూడు రూపాయలకే రిక్షా కడితే ఆ మిగిలిన రెండు రూపాయలూ ఇంకో విధంగా సద్వినియోగం చెయ్యొచ్చనని. కాని నా అభిప్రాయం రిక్షావాడికేం తెలుస్తుంది? రిక్షావాడు ససేమిరా ఒప్పుకోలేదు.

"సరే పద" అని రిక్షా ఎక్కబోయాను

"ఇదే కాదు. తోవలో మీ రెవరితోనైనా మాట్లాడాలని రిక్షా ఆపమన్నా, కాఫీ టీలు తాగుతానని ఆపమన్నా, సిగరెట్లు కొనుక్కోవాలని ఆపమన్నా, ఇంకే పనిమీద ఆపమన్నా రూపాయి ఎగ్స్ట్రా అవుద్ది!" అన్నాడతను.

ఇదొకటా? ఇదో వెయిటింగ్ ఛార్జియా ఆటో వాడిలా!

"సరే అలాగే కానీవోయ్" అని రిక్షా ఎక్కాను. నా అవసరం మరి. ఏం చేయను?

తోవలో వేణుగోపాలస్వామి కోవెల దాటుతున్నాను. రోడ్డుకి ఓ పక్కగా మూడు చక్రాల సైకిల్ మీద ఓ వికలాంగుడు కూర్చుని బిచ్చమెత్తుకుంటున్నాడు. ఆ మూడు చక్రాల సైకిల్ని ఏ లయన్స్ క్లబ్వారో దానం చేశారు. ఆ వికలాంగుని కెదురుగా మరో వికలాంగుడు కూర్చుని బిచ్చ మెత్తుకుంటున్నాడు. అతని రెండు కాళ్ళకీ కృత్రిమ అవయవాలు అమర్చి ఉన్నాయి. ఆ కృత్రిమావయవాలు రెండింటినీ ఏ రోటరీ వాళ్ళో బహుకరించారు.

నా ఫ్రెండొకడున్నాడు. అతడు యుటోపియన్ సిద్ధాంతాన్ని నమ్మినవాడు. సర్ టి.మోర్ అనే పాశ్చాత్య రచయిత 1516-1551 సంవత్సరాల మధ్య 'యుటోపియా' అనే ఊహాజనితమైన దీవిని సృష్టించాడు. ఆ దీవిలో కులమత భేదాలుండవు. స్వచ్ఛమైన రాజకీయాలు, చట్టాలు ఉంటాయి.జాతి భేదాలు అసలే ఉండవు. సర్వప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తారు. కరవు కాటకాలంటే ఆ దీవి ప్రజలకు తెలియవు. కాని అలాంటి దేశం ప్రపంచంలో ఉండడం సాధ్యమా?

మరొక మిత్రుడున్నాడు. అతనొక సామ్యవాద పార్టీలో సభ్యుడు. సమసమాజ నిర్మాణానికి కృషి చేసే పార్టీ అది. తక్షణమే కాకపోయినా వందసంవత్సరాల తరువాత నైనా ఆ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందని అతని నమ్మకం. అప్పుడు దేశంలో పేదరికమే లేక ధనికులకీ, మధ్యతరగతికీ మధ్య అంతరాలే

తగ్గిపోతాయి. అంటాడతను. అంతవరకూ పదిపైసలూ పావలా పేదవారికి దానం చేసినా ప్రయోజనం శూన్యమని వాదిస్తాడతను.

ఆయుర్వే దౌషధాలు దీర్ఘకాలం వాడితే మిగిలిన జీవితమంతా రోగం అన్నది తొంగిచూడదని అంటారు. నిజమే కావచ్చు. కాని అంతవరకూ బాధను భరిస్తూ ఉండటం ఎలా? తక్షణమే బాధను నివారించి ఉపశమనాన్ని కలిగించే ఇంగ్లీషు మందునే కదా రోగి కోరుకుంటాడు?

'ఇంటికో పువ్వు ఈశ్వరుడి కో మాల' అన్నట్లు పదిపైసలు చొప్పున పదిమందీ ఇస్తే, ఓ బన్ రొట్టెతిని, టీ తాగి ప్రాణం నిలుపుకోలేడా ఆ బిచ్చగాడు?

అందుకే ఆ వికలాంగు లిద్దర్నీ చూసి యథాశక్తి వారికి తోడ్పడాలనిపించింది. ఆ పూట బన్‌రొట్టె తినైనా ప్రాణం నిలుపుకుంటారు కదా అని.

"బాబూ! ఓమాటు రిక్షా ఆపవోయ్!" అన్నాను. ఆపాడు.

అతని కెలాగూ రూపాయి ఎక్స్ట్రా ఇవ్వడానికి సిద్ధపడే ఉన్నాను.

రిక్షా దిగి, ఇద్దరు వికలాంగులకీ చెరో అయిదు రూపాయలూ ఇచ్చాను.

"ఇక పదవోయ్ స్టేషన్‌కి" అన్నాను.

స్టేషన్ దగ్గర దిగుతూ వెయిటింగ్ ఛార్జీతో కలిపి ఆర్రూపాయ లివ్వబోయాను.

"ఒద్దు బాబూ వద్దు. మొదట మీరు బేరమాడిన మూడు రూపాయలే ఇవ్వండి చాలు" అన్నాడు.

'ఏం చేత?' అన్నట్లు అతనివైపు చూశాను.

"మీలో ఇంత కనికరం ఉందని తెల్దుబాబూ! కొందరు అనవసరంగా క్లబ్బుల్లో పేకాటాడి డబ్బు పోగొట్టుకుంటారు. కొందరు బార్‌లలో మందు కొడుతూ డబ్బు పాడుసేసుకుంటారు. సిగరెట్ల కయ్యేది ఎన్నిరెట్లో ఇక చెప్పే అక్కర్లేదు.

"మరి కొందరు తమ పిల్లల్ని కాన్వెంట్లో చదివించుకుందికి వేలకి వేలు ఫీజులు కడతారు. ఆ పిల్లలు కాలికి తొడుక్కునే మేజోడుపాటి ఇలువ లేదు మా కిచ్చే కూలి. మా బోటి కష్టపడినోళ్ళకి రూపాయి ఎక్కువివ్వలేక బేర మాడుతుంటారు. అటువంటిది తమరు అవిటి వాళ్ళిద్దరికీ ఏ పదిపైసలో, పావలావో ఒడేయకుండా అయిదేసి. రూపాయలిచ్చేరంటే మీకు చేతులెత్తి దండవెట్టాలి

బాబూ! నాబోటి కాళ్ళూ సేతులూ ఉన్నోడు ఏదో కష్టం సేసి పొట్ట పోసుకుంటాడు. అలాటి అవిటోళ్ళని సూసే దెవరు  బాబూ?" అన్నాడు.

అతని కళ్లల్లో ఆర్ద్రత గోచరించింది.

ఇంత ఉంగరాల జుత్తు రిక్షావాడూ ఉంగరాల్లాగే మెలికలు తిరిగిపోయాడు!

'ఓహో! వీడిలో ఎంత మానవతా దృష్టి ఉంది? మనలో మానవత్వం ఉన్నప్పుడు ఎదుటివానిలోని దానవత్వం కూడా మానవత్వం కింద మార్చే అవకాశం ఉందన్నమాట! మనలో దయాగుణం ఉన్నప్పుడు ఎదుటివానిలోని నిర్దయని దయగా మార్చవచ్చు నన్నమాట!' అనుకుని, మూడు రూపాయలూ చేతిలోపెట్టి బయటపడ్డాను.

● ఆంధ్రప్రభ వీక్లీ ●
*1-11-1989*